



అనంతపురం కార్పొరేషన్ ఎదుట గుండు గీయించుకుంటున్న మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నగర అధ్యక్షులు ఎర్రిస్వామి

అరగుండు.. పొర్లుదండాలు..!

◆ మున్సిపల్ కార్మికుల నిరసనాగ్రహం
◆ జిల్లా వ్యాప్తంగా కొనసాగిన ఆందోళనలు



పొర్లు దండాలు పెడుతున్న మున్సిపల్ కార్మికులు

ప్రజాశక్తి -అనంతపురం కార్పొరేషన్

ఎన్నికల హామీల అమలు, సమస్యల పరిష్కారం కోరుతూ మున్సిపల్ కార్మికులు చేపట్టిన సమ్మె జిల్లా వ్యాప్తంగా కొనసాగుతోంది. శుక్రవారం నాటికి సమ్మె 11వ రోజుకు చేరుకుంది. ప్రభుత్వ మొండివైఖరిని నిరసిస్తూ కార్మికులు వివిధ రూపాల్లో ఆందోళనను కొనసాగిస్తున్నారు. అందులో భాగంగా శనివారం నాడు అనంతపురం కార్పొరేషన్ ఎదుట మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నగర అధ్యక్షులు ఎర్రిస్వామి అరగుండు గీయించుకుని నిరసన తెలిపారు. అనంతరం రోడ్డుపై కార్మికులు పొర్లుదండాలు పెట్టారు. సప్తగిరి సర్కిల్ నుంచి అంబేద్కర్ సర్కిల్ వరకు ప్రదర్శన నిర్వహించి అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వం స్పందించి తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్ర కుమార్ మాట్లాడుతూ మున్సిపల్ కార్మికుల సమస్యలపై ప్రభుత్వం ఇప్పటికి రెండు సార్లు చర్చలు చేసినప్పటికీ ప్రధాన సమస్యల పరిష్కారంపై స్పష్టత ఇవ్వలేదన్నారు. మున్సిపల్ కార్మికులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. ఎన్నికల సమయంలో జగన్ ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయకుంటే వచ్చే ఎన్నికల్లో వైసిపి ప్రభుత్వం కార్మికుల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. సమ్మెతో పట్టణాలు, నగరాల్లో చెత్త పేరుకుపోయి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, ఈ పరిస్థితుల్లో అంటువ్యాధులు ప్రబలితే ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నగర కార్యదర్శి వెంకటనారాయణ, మున్సిపల్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఏటీఎం నాగరాజు, నగర కార్యదర్శి తిరుమలేశు, ఎర్రిస్వామి, నల్లప్ప, ఓబుళపతి, రాయుడు, మల్లికార్జున, పోతులయ్య, మురళి, లక్ష్మీనరసింహ, వరలక్ష్మి పాల్గొన్నారు.



విద్యుత్ దీపాలంకరణలో జెఎన్‌టియు ఎన్టీఆర్ ఆడిటోరియం

నేడు స్నాతకోత్సవ సంబరం

◆ ముస్తాబైన అనంత జెఎన్‌టియు ◆ ముఖ్య అతిథిగా రానున్న గవర్నర్



కాన్విగేషన్ రిహార్సల్స్‌లో పాల్గొన్న జెఎన్‌టియు ఉన్నతాధికారులు

ప్రజాశక్తి-అనంతపురం

అనంతపురం జెఎన్‌టియు 13వ స్నాతకోత్సవ సంబరానికి అంతా సిద్ధం అయ్యింది. శనివారం ఉదయం జరగనున్న ఈ కార్యక్రమానికి సంబంధించి ఎన్టీఆర్ ఆడిటోరియంను సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. విద్యుత్ దీపాలతో భవనంను అలంకరించారు. సబికులకు కుర్చునే సీటింగ్, డయాస్‌ను అన్ని వసతులతో అందుబాటులోకి తెచ్చారు. రాష్ట్ర గవర్నర్, ఛాన్సలర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ స్నాతకోత్సవంలో ప్రత్యక్షంగా పాల్గొంటున్నారు. స్నాతకోత్సవ రిహార్సల్స్‌ను జెఎన్‌టియు ఉపకులపతి ఆచార్య రంగ జనార్ధన నేతత్వంలో శుక్రవారం నిర్వహించారు. కాన్విగేషన్ ప్రాసెస్, సమయపాలనలో జరగాల్సి ఉంటుంది. ఈ కార్యక్రమంలో ఎటువంటి లోపాలు లేకుండా నిర్వహించేందుకు వర్సిటీ యంత్రాంగం చేపట్టింది. గవర్నర్ రాక నేపథ్యంలో వర్సిటీ ప్రాంగణమంతా పోలీస్ పర్యవేక్షణలోకి వెళ్లింది. కాన్విగేషన్‌కు వచ్చే అతిథులు, విద్యార్థులకు ప్రత్యేక పాసులు జారీ చేశారు. ఇప్పటికే కాన్విగేషన్ కార్యక్రమానికి రాష్ట్ర ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ ఆచార్య కె.హేమచంద్ర రెడ్డి, డాక్టరేట్ అందుకోనున్న ఆచార్యకే బాల వీరారెడ్డి, ముఖ్య అతిథి వి.సత్యనారాయణ రాజు శుక్రవారం సాయంత్రమే నగరానికి చేరుకున్నారు. వారికి వర్సిటీ ఉన్నతాధికారులు స్వాగతం పలికారు. కలెక్టర్ గౌతమి, జిల్లా పోలీసు యంత్రాంగం గవర్నర్ పర్యటన నేపథ్యంలో ఏర్పాట్లను పరిశీలించారు.

ఉదయం 11 గంటలకు ప్రారంభం

స్నాతకోత్సవం ఉదయం 11 గంటలకు ప్రారంభం అవుతుంది. మధ్యాహ్నం 12:30గంటల వరకు జరగనుంది. ఉత్తమ ప్రతిభ కనబరిచిన 71 మంది విద్యార్థులకు బంగారు పతకాలు, 265 మందికి పిహెచ్‌డి డిగ్రీలు, బీటెక్, బీ ఫార్మసీ పూర్తి చేసిన 68,963 మందికి, ఎంటెక్, ఎం ఫార్మసీ తదితర పీజీ కోర్సులు పూర్తి చేసన 16,914 మందికి డిగ్రీ పట్టాలను గవర్నర్ చేతుల మీదుగా విద్యార్థులు అందుకోనున్నారు.

వైసిపిని వీడిన 'కాపు'

◆ రాజీనామా చేస్తున్నట్టు ప్రకటన - రాయదుర్గం, కళ్యాణదుర్గంలో స్వతంత్ర అభ్యర్థులుగా పోటీ చేస్తాం : కాపు



ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి, రాయదుర్గం

ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి వైసిపిని వీడుతున్నట్టు ప్రకటించారు. నమ్మించి తన గొంతు కోశారంటూ ఆవేదన వ్యక్తం చేశారు. అంతేకాకుండా రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో తాను రాయదుర్గం, తన భార్య కాపు భారతి కళ్యాణదుర్గం నుంచి స్వతంత్ర అభ్యర్థులుగా పోటీ చేయనున్నట్టు కూడా ప్రకటించడం రాజకీయంగా చర్చనీయాంశమవుతోంది. ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి వైఎస్ కుటుంబాన్ని నమ్మిన వ్యక్తిగా చెబుతారు. అందుకే ఆయన వైసిపి ఆవిర్భావం నుంచి పార్టీ వెంటనే ఉంటూ వచ్చారు. 2009లో వైఎస్.రాజశేఖర్‌రెడ్డి ఆశీస్సులతో ఆయన కాంగ్రెసులోకి రాజకీయ రంగ ప్రవేశం చేశారు. జిల్లాలో సీనియర్ నాయకుడైన పాటిల్ వేణుగోపాల్‌రెడ్డిని కూడా కాదని కాపు రామచంద్రారెడ్డికి టిక్కెట్టు ఇచ్చారు. తొలి ప్రవేశంలోనే ఎమ్మెల్యేగానూ ఎన్నికయ్యారు. వైఎస్ మరణం తరువాత వైఎస్.జగన్మోహన్‌రెడ్డి వైసిపిని ఏర్పాటు చేశాక కాంగ్రెస్ పార్టీని వీడి ఆ పార్టీలో చేరిన ఎమ్మెల్యేలు 12 మంది ఉన్నారు. అందులో కాపు రామచంద్రారెడ్డి ఒకరు. వైసిపిలో చేరిన 12 మంది ఎమ్మెల్యేలు పదవికీ రాజీనామాలు చేసి ఉప ఎన్నికలకు వెళ్లగా అందులో 12 మంది గెలుపొందారు. ఈ గెలుపొందిన వారిలో రాయదుర్గం నియోజకవర్గం నుంచి కాపు రామచంద్రారెడ్డి, అనంతపురం నుంచి ఎమ్మెల్యే గురునాథరెడ్డిలున్నారు. 2012లో జరిగిన ఆ ఉప ఎన్నికల్లో ఈ ఇద్దరూ గెలుపొందారు. 2014 ఎన్నికల్లోనూ కాపు రాయదుర్గం నుంచి పోటీ చేసినప్పటికీ స్వల్ప ఓట్ల మెజార్టీతో ఓడిపోయారు. 2019లో జరిగిన ఎన్నికల్లో విజయం సాధించారు. బిసి కూడా కావడంతో ఆయన మంత్రి పదవి వస్తుందన్న ప్రచారం నడిచింది. అయితే ఆయన ఈ పదవి లభించలేదుగానీ, ప్రభుత్వ విప్‌ను ఇచ్చారు. ఈ ఎన్నికల్లోనూ ఆయనకు స్థానముంటుందని భావించినప్పటికీ గత కొన్ని రోజులుగా ఆయన్ను నియోజకవర్గం మార్పు చేస్తారని ప్రచారం నడించింది. అందుకు తగ్గట్టుగా కాపు రామచంద్రారెడ్డి కళ్యాణదుర్గం నియోజకవర్గంలో పర్యటించడం, తనకు ఈ నియోజకవర్గం నుంచి అవకాశముండనుందని సన్నిహితుల వద్ద కూడా ప్రకటించారు. కాని ఇటీవల విడుదలైన జాబితాలో కళ్యాణదుర్గం నియోజకవర్గ సమన్వయకర్తగా అనంతపురం పార్లమెంటు సభ్యులు తలారి రంగయ్యను నియమించారు. ఈ ప్రకటన వెలువడిన వెంటనే హుటాహుటిన ఆయన విజయవాడకు పయనమై వెళ్లారు. అప్పటి నుంచి వివిధ రూపాల్లో ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డిని కలిసే ప్రయత్నాలు చేసినట్టు తెలుస్తోంది. ఆయన కూడా మీడియాతో మాట్లాడే సమయంలో స్వయంగా వెల్లడించారు. ముఖ్యమంత్రిని కలుద్దామని ప్రయత్నించినా అపాయంట్‌మెంట్ దొరకలేదని ఆయన తెలిపారు. దీంతో తాను స్వతంత్రంగా బరిలో దిగుతానని ప్రకటించడం చర్చనీయాంశమవుతోంది. నాలుగు అసెంబ్లీ స్థానాల మార్పు తరువాత తొలిసారిగా జిల్లాలో వ్యతిరేక గళం వినబడింది. పూర్తిస్థాయి జాబితా బయటకు వస్తే ఏ విధంగా ఉండనుందన్నది రాజకీయ వర్గాల్లో చర్చ నడుస్తోంది. ఈ మార్పులు రాబోయే ఎన్నికల సమయంలో వైసిపికి ఏ మేరకు ప్రభావం చూపనున్నాయన్నది ఆసక్తికరంగా మారింది. ఈ ఎన్నికల్లో పెద్దఎత్తునే అభ్యర్థుల మార్పులుంటాయన్న ప్రచారం ముందు నుంచి నడుస్తూ వస్తున్న విషయం తెలిసిందే. అయితే ప్రకటన తరువాత ఇటువంటి పరిణామాలు ఇంకెన్ని ఉంటాయన్నది చూడాల్సి ఉంది.

సమస్యలు పరిష్కరించాల్సిందే..

అనంతలో నల్లమాస్కులు, చేతులకు బేడీలతో అంగన్వాడీల నిరసన
జిల్లావ్యాప్తంగా కొనసాగిన ఆందోళనలు



పామిడిలో ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డిని అడ్డుకుంటున్న అంగన్వాడీలు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ అంగన్వాడీ కార్మికులు చేపట్టిన సమ్మె శుక్రవారం జిల్లావ్యాప్తంగా కొనసాగింది. ఇందులో భాగంగా అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా కోశాధికారి జమున అధ్యక్షతన జిల్లాకేంద్రంలో అంగన్వాడీలు నల్లమాస్కులు ధరించి, చేతులకు నల్ల రిబ్బన్లతో బేడీలు వేసుకుని నిరసన తెలిపారు. వీరికి సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్రకుమార్, నగర కార్యదర్శి వెంకటనారాయణ, జిల్లా ఉపాధ్యక్షులు తలారి రామాంజనేయులు, పోతులయ్య, గ్రామ పంచాయతీ ఉద్యోగులు కార్మికుల యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి శివప్రసాద్ మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి కార్మికుల యూనియన్ నాయకులు అరుణమ్మ, నక్షత్ర, రుక్మిణి, జ్యోతి, లావణ్య, తదితరులు పాల్గొన్నారు.

నార్పల మండల కేంద్రంలో అంగన్వాడీలు చేపట్టిన సమ్మె శుక్రవారం 25వ రోజుకు చేరుకుంది. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు అధ్యక్షురాలు డొక్కా శ్రీదేవి, సెక్టార్ లీడర్లు ఎం.రామాంజినమ్మ, సుధామణి, రేణుక, వెంకటలక్ష్మి, కళావతి, అంగన్వాడీలు పాల్గొన్నారు.

పుట్లూరు మండల కేంద్రంలో అంగన్వాడీలు చేపట్టిన సమ్మె కొనసాగుతోంది. వీరికి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్.సూరి మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీ రైతుసంఘం మండల కార్యదర్శి జి.వెంకటచౌదరి, వ్య.కా.సం మండల అధ్యక్షుడు టి.పెద్దయ్య, నాయకులు బి.భాస్కర్‌రెడ్డి, కుళ్లాయప్ప, కె.నాగభూషణ్, అంగన్వాడీ యూనియన్ నాయకురాళ్లు జయలలిత, శశికళ, రమాదేవి, అనంతలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

పామిడి మండల కేంద్రంలో అంగన్వాడీల సమ్మె కొనసాగింది. ఇందులో భాగంగా శుక్రవారం పట్టణ పర్యటనకు వచ్చిన ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి వాహనాన్ని అడ్డుకుని నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి మల్లేష్, అంగన్వాడీలు జయంతి, మహాలక్ష్మి, నారాయణమ్మ, భారతి, జ్యోతి, యశోద, అనిత, అంగన్వాడీలు, తదితరులు పాల్గొన్నారు.



ఉరవకొండలో దీక్ష శిబిరంలో కూర్చొన్న అంగన్వాడీలు, వామపక్షాల నాయకులు

ఉరవకొండతోపాటు విడపనకల్, వజ్రకరూరు మండల కేంద్రాల్లో అంగన్వాడీలు చేపట్టిన సమ్మె కొనసాగింది. వీరికి వామపక్షాల నాయకులు మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కన్వీనర్లు మధుసూదన్, విరపాక్షి, జిల్లా కమిటీ సభ్యులు రంగారెడ్డి, సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి మల్లికార్జున, సహాయ కార్యదర్శి చెన్నారాయుడు, నాయకులు సుల్తాన్, తలారి మల్లికార్జున, అంగన్వాడీ యూనియన్ నాయకురాళ్లు విజయ, అరుణ, కాంతమ్మ, దుర్గాదేవి, శ్వేత, నాగు, సరోజమ్మ, జ్యోతి, రామంజినమ్మ, లోకమ్మ, నాగమణి, శివశ్రీ, సువర్ణమ్మ, శశికళ, లక్ష్మీదేవి, కృష్ణవేణి, తదితరులు పాల్గొన్నారు.

గుత్తిలో అంగన్వాడీల నిరవధిక సమ్మె శుక్రవారం 25వ రోజుకి చేరుకుంది. ఇందులో భాగంగా స్థానిక ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద అంగన్వాడీలు శిబిరం ఏర్పాటు చేసుకుని రిలేదీక్షలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఏపీ అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ సెక్టార్ నాయకురాళ్లు పార్వతి, శారద, కళ్యాణి, బావమ్మ, శోభ, గంగ, తదితరులు పాల్గొన్నారు.





అనంతపురం కలెక్టరేట్ ఎదుట అంగన్‌వాడీల దీక్షా శిబిరం వద్ద పోలీసులు ఇనుప కంచె ఏర్పాటు చేయడంతో దాని వెనుక చేతికి బేడీలు వేసుకుని నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు

బురదజల్లే ప్రయత్నం చేస్తే చర్యలు : ఎస్పీ

ప్రజాశక్తి-అనంతపురం క్రైం

ప్రజల దృష్టి మరల్చి పోలీసులపై బురదజల్లే ప్రయత్నం చేస్తే చర్యలు తప్పవని ఎస్పీ కెకెఎన్ అన్బురాజన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వాట్సాప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, తదితర సోషల్ మీడియాలో ఇష్టానుసారంగా సత్యదూరమైన పోస్టులు పెట్టడం ప్రజల దృష్టి మర్చలడమే అన్నారు. ముఖ్యంగా నగరంలోని కోవూరు నగర్‌లో ఉన్న ఓ పార్కులో 'గంజాయితో ఎంజాయ్' అంటూ ముందూ వెనుకా ఆలోచించకుండా ఓ సోషల్ మీడియా గ్రూపులో పోస్టులు పెట్టారన్నారు. అయితే కోవూరు నగర్ పార్కుపైనే కాదు జిల్లాలోని అన్నిపార్కులపై ప్రత్యేక నిఘా వేశామన్నారు. ఎక్కడా అలాంటి పనులు జరగడం లేదన్నారు. అంతేగాకుండా గత మూడునెలల్లో 40 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని, 40 మందిని అరెస్టు చేశామన్నారు. అనంతపురంతో పాటు గుత్తి, గుంతకల్లు ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా వేసి గంజాయితో సంబంధం ఉన్న వారిపై చర్యలు తీసుకున్నామన్నారు. పాత వీడియోలను మార్చి కొత్తగా జరిగినట్లు సృష్టించి పోస్టులు పెట్టడం, అసభ్యకరంగా ఉన్న డీప్ ఫేక్ వీడియోలు పెట్టి వేధించడం చేస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దీంతోపాటు అనవసరంగా ఎవరిపైనైనా అసత్య ప్రచారాలు చేసినా, తప్పుడు పోస్టులు పెట్టినా బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లాలో ఏవైనా సమస్యలు ఉన్నా, ఎక్కడైనా చట్ట వ్యతిరేక కార్యకలాపాలు జరుగుతున్నా తన ఫోన్ : 94407 96800కు సమాచారం ఇవ్వాలన్నారు. అలాగే సోషల్ మీడియాలో వేధిస్తున్నా, సైబర్ మోసాలు జరిగినా వెంటనే 1930కు ఫోన్ చేయాలని విజ్ఞప్తి చేశారు.

అనంత వెంకటరెడ్డి జీవితం స్ఫూర్తిదాయకం

వర్ధంతి సభలో వక్తలు

ప్రజాశక్తి-అనంతపురం

జిల్లా రాజకీయ చరిత్రలో సుదీర్ఘ కాలం ప్రజాప్రతినిధిగా పని చేసిన అనంత వెంకటరెడ్డి జీవితం స్ఫూర్తిదాయకమని పలువురు ప్రజాప్రతినిధులు కొనియాడారు. అనంత వెంకటరెడ్డి వర్థంతిని పురస్కరించుకుని శుక్రవారం బుక్కరాయసముద్రం మండలంలోని రోటరీపురం వద్ద ఉన్న ఘాట్ వద్ద పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ప్రజాప్రతినిధిగా అనంత వెంకటరెడ్డి జిల్లాను కరువు బారి నుంచి కాపాడేందుకు విశేష కృషి చేశారన్నారు. ఆయన సేవలను గుర్తించిన దివంగత సిఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హంద్రీనీవాకు అనంత వెంకటరెడ్డి పేరు పెట్టారని గుర్తు చేశారు. అంతకుముందు సర్వజనాస్పత్రిలో వైసిపి బీసీ సెల్ రీజినల్ ఇన్‌ఛార్జి రమేష్‌గౌడ్ ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికులకు దుస్తులు పంపిణీ చేశారు. కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే అనంత వెంకట రామిరెడ్డి, అనంత సుబ్బారెడ్డి, అనంత చంద్రారెడ్డి, రిటైర్డ్ ప్రొఫెసర్ విద్యాసాగర్‌రెడ్డి, మాలతి, సువర్ణ, కుటుంబ సభ్యులు, బంధువులతోపాటు ఎంపిలు రంగయ్య, గోరంట్లమాధవ్, ఎమ్మెల్సీ మంగమ్మ, ఎమ్మెల్యేలు కేతిరెడ్డి పెద్దారెడ్డి, వై.వెంకట్రామిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి, జెడ్పీ ఛైర్‌పర్సన్ గిరిజమ్మ, రజక కార్పొరేషన్ ఛైర్మన్ మీసాల రంగన్న, టిటిడి బోర్డు సభ్యులు అశ్వర్థనాయక్, ఐడీసీ మాజీ ఛైర్మన్ నల్లపురెడ్డి, బెస్త కార్పొరేషన్ డైరెక్టర్ కేవీ రమణ, డిప్యూటీ మేయర్ వాసంతిసాహిత్య, ఉన్నత విద్యామండలి ఛైర్మన్ హేమచంద్రారెడ్డి, వైసీపీ నగర అధ్యక్షుడు చింతా సోమశేఖరరెడ్డి, వైసీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నర్సింహయ్య, మేయర్ మహమ్మద్ వసీం, ఏడీసీసీ బ్యాంకు ఛైర్మన్ లిఖిత, మాజీ ఛైర్మన్ పామిడి వీరాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.



అనంత వెంకటరెడ్డి ఘాట్ వద్ద పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న నాయకులు



ఎఒ శ్రీధర్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న సిపిఎం నాయకులు

ఉపాధి కూలీలకు సౌకర్యాలు కల్పించాలి : సిపిఎం

ప్రజాశక్తి-పుట్లూరు

మండలంలో ఉపాధి పనులు చేస్తున్న చోట కూలీలకు కనీస మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేస్తూ సిపిఎం ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఎఒ శ్రీధర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి సూరి మాట్లాడుతూ ఉపాధి హామీ చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేయాలన్నారు. ముఖ్యంగా పనులు చేసేచోట టెంటు వేయడంతోపాటు మెడికల్ కిట్లు, పనిముట్లను అందుబాటులో ఉంచాలన్నారు. వారం వారం బిల్లులను సక్రమంగా జమ చేయాలన్నారు. పెండింగులో ఉన్న బిల్లులు చెల్లించాలని, అడిగిన వారందరికీ పనులు కల్పించాలని, 200 రోజులు పనులు కల్పించి రోజుకు రూ.600 కూలి పడేలా చూడాలని, ఉపాధి హామీ మెట్లకు పారితోషికం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు టి.పెద్దయ్య, మండల కార్యదర్శి బి,భాస్కర్‌రెడ్డి, రైతుసంఘం మండల కార్యదర్శి జి.వెంకట చౌదరి, నాగలింగారెడ్డి నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమ పాలనలో జగన్ ఆదర్శం

పింఛన్ల పంపిణీలో నాయకులు

ప్రజాశక్తి-ఉరవకొండ

సామాజిక బాధ్యతతో ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేస్తున్న ఘనత సిఎం జగన్‌కే దక్కుతుందని పలువురు నాయకులు అన్నారు. శుక్రవారం ఉరవకొండ, విడపనకల్ మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో పింఛన్ పెంపు వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి మాట్లాడుతూ పేదల జీవితాల్లో ఆనందం చూడటమే సిఎం జగన్ లక్ష్యమన్నారు. ఇందులో భాగంగా వృద్ధాప్య, వితంతు పింఛన్లను రూ.3వేలకు పెంచారన్నారు. ముందుగా సిఎం జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపిలు నరసింహులు, కరణం పుష్పావతి భీమిరెడ్డి, నాయకులు శ్రీనాథ్‌రెడ్డి, పార్వతమ్మ, హనుమంతు, వన్నప్ప, ఓబుళమ్మ, జోగి వెంకటేష్, ఆసీఫ్, వడ్ల షేక్షావలి, శ్రీరాములు, ఈడిగ ప్రసాద్, హొన్నూరుసాబ్, మల్లికార్జున, సుంకన్న, గిరిబాబు, దేశాయి, దోనేకల్ రమేష్, ఎంపిడిఒలు అమృతరాజ్, శ్రీనివాసులు, ఇఒఆర్‌డి చంద్రమౌళి, ఇఒ గౌస్ పాల్గొన్నారు.


పింఛన్లు పంపిణీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి

పామిడి : పట్టణ పరిధిలోని మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి శుక్రవారం నూతన పింఛన్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ ప్రభాకర్‌నాయక్, ఇఒఆర్‌డి శశికళ, ఎంపిపి మురళీమోహన్‌రెడ్డి, మాజీ మార్కెట్ యార్డు ఛైర్మన్ చెన్నకేశవరెడ్డి, వైస్ ఎంపిపి కాయల మహేష్, ఎంపిటిసి మజ్జిగ రాశేఖర్, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జెసి ప్రభాకర్‌రెడ్డిని అరెస్టు చేయాలి

తాడిపత్రి-గుత్తి రహదారిపై చుక్కలూరు ఎంపిటిసి మేరీ ఆందోళన

ప్రజాశక్తి-తాడిపత్రి రూరల్

దళితులపై దాడి చేసిన తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ జెసి దివాకర్‌రెడ్డిని వెంటనే అరెస్టు చేయాలని చుక్కలూరు ఎంపిటిసి మేరీ, భర్త భాస్కర్ డిమాండ్ చేశారు. ఈమేరకు శుక్రవారం పట్టణ పరిధిలోని చుక్కలూరు వద్ద తాడిపత్రి-గుత్తి రహదారిపై బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శుక్రవారం ఉదయం చుక్కలూరు వద్ద ఇసుకలోడుతో వస్తున్న ట్రాక్టర్‌ను అటుగా వెళ్తున్న జేసీ ప్రభాకర్‌రెడ్డి అడ్డుకుని ట్రాక్టర్ టైర్లలో గాలి తీసేందుకు యత్నించారన్నారు. అయితే అక్కడే ఉన్న ట్రాక్టర్ యజమాని, ఎంపిటిసి భర్త భాస్కర్ అడ్డుకున్నాడు. దీంతో ఇద్దరి మధ్య మాటామాటా పెరిగి ఉద్రిక్త వాతావరణం చోటుచేసుకుంది. ఈనేపథ్యంలో జెసి ప్రభాకర్‌రెడ్డి తనపై రాడ్డుతో దాడి చేశాడని ఎంపిటిసి భర్త భాస్కర్ వాపోయాడు. వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆందోళనతో దాదాపు నాలుగు కిలోమీటర్ల మేర ట్రాఫిక్ స్తంభించింది. విషయం తెలుసుకున్న రూరల్ సీఐ లక్ష్మీకాంత్‌రెడ్డి, ఎస్ఐ గౌస్‌మహమ్మద్ ఘటనా స్థలానికి వెళ్లి పరిస్థితిని సమీక్షించారు. ఆందోళన విరమించాలని కోరారు. అనంతరం ఎంపిటిసి మేరీ, వైసీపీ దళిత నాయకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకునట్లు రూరల్ పోలీసులు తెలిపారు.


ఆందోళన చేస్తున్న ఎంపిపి, వైసిపి నాయకులు

యుటిఎఫ్ డైరీ, క్యాలెండర్, గోడపత్రిక ఆవిష్కరణ

రాయదుర్గం : యుటిఎఫ్-2024 డైరీ, స్టిక్కర్, క్యాలెండర్, గోడపత్రికలను శుక్రవారం ఎంఇఒలు నాగమణి, రామచంద్ర, యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి రవికుమార్, గౌరవాధ్యక్షులు నాగరాజు విడుదల చేశారు. కార్యక్రమంలో గుమ్మఘట్ట మండల శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రామాంజనేయులు, నాగరాజు, కోశాధికారి శ్రీనివాస్‌కుమార్, సహాధ్యక్షులు మహాలక్ష్మి, సభ్యులు పాల్గొన్నారు.


క్యాలెండర్లను విడుదల చేస్తున్న యుటిఎఫ్ నాయకులు

రాయదుర్గం : డి.హీరేహాల్ ఎంఆర్‌సిలో ఎంఇఒ షానోవర్‌బాషా, జడ్పి హైస్కూల్ హెచ్‌ఎం రామాంజనమ్మ యుటిఎఫ్-2024 డైరీ, క్యాలెండర్లను ఆవిష్కరించారు. యుటిఎఫ్ మండల అధ్యక్షులు ఆర్.మోహన్‌బాబు, ప్రధాన కార్యదర్శి జి.రామాంజనేయులు మాట్లాడుతూ ఈ నెల 9, 10 తేదీల్లో విజ యవాడలో 36 గంటల ధర్నాకు యుటిఎఫ్ పిలుపునిచ్చిందని, మండలంలోని ఉపాధ్యాయులు, సమా ఖ్య నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో కన్నడ టీచర్స్ అసోసియేషన్ మండల నాయకులు ఈరాలప్ప, యుటిఎఫ్ మండల గౌరవాధ్యక్షులు హనుమంతప్ప, సహాధ్యక్షులు రామచంద్రప్ప, కుసుమవతి, కోశాధికారి వన్నూరప్ప, ఉపాధ్యాయులు నాగరాజు, జయసింహా, ఉరుకుందప్ప, రమేష్, హరి, లోకాభిరామ్, నాగరాజు, భార్గవి, గాయత్రి, జయశ్రీ, ప్రసన్నలక్ష్మి, సునీత, నాగవేణి, విజయమ్మ, విజయభారతి, రామలక్ష్మి, కేదారేశ్వరి పాల్గొన్నారు.

రైతు కుటుంబానికి పరిహారం అందజేత

ఉరవకొండ : ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబానికి మంజూరైన పరిహారాన్ని వజ్రకరూరు మండలం కొనకొండ్ల గ్రామంలో స్వగృహంలో ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి శుక్రవారం పంపిణీ చేశారు. కొనకొండ్లకు చెందిన రైతు కట్లగేరి నాగప్ప ఆత్మహత్య చేసుకోవడంతో సిఎం సహాయ నిధి నుంచి మంజూరైన రూ.7లక్షలను కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో కొనకొండ్ల గ్రామానికి చెందిన వైసిపి నాయకులు ఇందిరమ్మ, లాలెప్ప, గురుప్రసాద్, మాజీ ఎంపిపి రామచంద్ర, మునయ్య, ముద్దయ్య, చుక్కరాజు, తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల భిక్షాటన

ప్రజాశక్తి-గుత్తి

పట్టణంలో భిక్షాటన చేస్తూ మున్సిపల్ కార్మికులు గుత్తిలో వినూత్న రీతిలో నిరసన వ్యక్తం చేశారు. ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన నిరవధిక సమ్మె శుక్రవారం 11వ రోజుకు చేరుకుంది. ఇందులో భాగంగా కార్మికులు స్థానిక మున్సిపల్ కార్యాలయం నుంచి గాంధీ కూడలి మీదుగా రాజీవ్‌గాంధీ సర్కిల్ వరకూ ప్రదర్శన నిర్వహించారు. ఈకార్యక్రమంలో మున్సిపల్ పారిశుధ్య కాంట్రాక్టు కార్మికుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.రామాంజినేయులు, కె.సూర్యనారాయణ, ఉపాధ్యక్షుడు కె.మహేష్, సహాయ కార్యదర్శి సుంకన్న, కోశాధికారి బాలరంగన్న, నాయకులు బేడల నాగేంద్ర, ఈశ్వరయ్య, కె.ఆంజనేయులు, ఇంజనీరింగ్ కార్మికుల యూనియన్ అధ్యక్షుడు ఎస్. రాజా,ఉపాధ్యక్షుడు ఎస్ఎ.మురళి, కార్యదర్శి రవిశంకర్, కోశాధికారి నక్కా శేఖర్, నాయకులు నరసింహ, రాజ్‌కుమార్, ఓబులేష్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.


గుత్తిలో భిక్షాటన చేస్తున్న మున్సిపల్ కార్మికులు

గుంతకల్లు : ప్రభుత్వ అలసత్వాన్ని వ్యతిరేకిస్తూ మున్సిపల్ కాంట్రాక్టు కార్మికులు చేపట్టిన సమ్మె శుక్రవారం 11వ రోజుకు చేరింది. ఇందులో భాగంగా స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద సమ్మె శిబిరం నుంచి కార్మికులు సిఎం జగన్ చిత్రపటాన్ని మెడలో వేసుకుని ఊరేగింపుగా నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎపి మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ ఫెడరేషన్ జిల్లా నాయకులు కె.నరసయ్య, పట్టణ కార్యదర్శి జగదీష్, నాయకులు సూరి, మల్లేష్, రాకెట్ల మస్తాన్, రంగనాయకులు, ప్రేమ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.


గుంతకల్లులో జగన్ ఫొటోలతో ర్యాలీ నిర్వహిస్తున్న మున్సిపల్ కార్మికులు

రాయదుర్గం : సమ్మెలో భాగంగా ఎపి మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులు పట్టణంలో భిక్షాటన చేపట్టి నిరసన వ్యక్తం చేశారు. భిక్షాటన ద్వారా మున్సిపల్ కార్మికులు పట్టణ ప్రజల నుంచి రూ. 13,125 సేకరించారు. ఈ ఆర్థిక సాయాన్ని సమ్మె ఖర్చులకు ఉపయోగిస్తామని తెలిపారు. సమస్యలను పరిష్కరించే వరకూ పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి బి.మల్లికార్జున, ఫెడరేషన్ నాయకులు రాము, తిప్పేస్వామి, మల్లేష్, కుమార్, బసవరాజు, ఇంజినీరింగ్ కార్మిక సంఘం నాయకులు తిప్పే రుద్ర, నరసింహులు, మైలారప్ప, ఓబన్న, గోపాల్, కార్మికులు పాల్గొన్నారు.

కార్మిక పక్షపాతి ప్రజాశక్తి దినపత్రిక

క్యాలెండర్ ఆవిష్కరణలో సిఐటియు జిల్లా కార్యదర్శి నాగేంద్రకుమార్

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

ప్రజాశక్తి దినపత్రిక కార్మిక పక్షపాతిగా ఉంటూ హక్కుల సాధన కోసం ఆయుధంగా పని చేస్తోందని సిఐటియు జిల్లా కార్యదర్శి నాగేంద్రకుమార్ అన్నారు. శుక్రవారం స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయం ముందు మున్సిపల్ కార్మికులు చేపట్టిన సమ్మె శిబిరంలో ప్రజాశక్తి దినపత్రిక నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1981లో ప్రారంభమైన ప్రజాశక్తి కార్మిక కర్షక సామాజిక వర్గాల అభ్యున్నతికి తన పదునైన అక్షరాలతో కార్మికులకు గొంతుకుగా నిలుస్తోందని కొనియాడారు. భవిష్యత్తులో ప్రతి కార్మికుడూ ప్రజాశక్తి దినపత్రికను ఆదరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు ఏటీఎం నాగరాజు, రాష్ట్ర అధ్యక్షులు నాగభూషణం, సిఐటియు జిల్లా నగర కార్యదర్శి వెంకటనారాయణ, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నగర అధ్యక్షులు ఎర్రిస్వామి, నగర కార్యదర్శి సాకే తిరుమలేష్, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు సంజీవరాయుడు, పోతులయ్య, వరలక్ష్మి, మురళి, లక్ష్మీనరసమ్మ, పరశురాం, ప్రజాశక్తి విలేకరులు డేవిడ్, నరసింహారావు, సుధాకర్, 80 మంది మంది కార్మికులు పాల్గొన్నారు.


ప్రజాశక్తి దినపత్రిక క్యాలెండర్‌ను విడుదల చేస్తున్న నాయకులు

సమస్యల పరిష్కారానికి కృషి

పామిడి గ్రామసభలో ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి

ప్రజాశక్తి-పామిడి

పామిడిలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఎంపిడిఒ ప్రభాకర్‌నాయక్ అధ్యక్షతన గ్రామసభ ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా పామిడి నగర పంచాయతీ డీనోడిఫై గ్రామ పంచాయతీగా ఏర్పడినందున పంచాయతీ నిబంధనల మేరకు ఇంటి పన్నుల నిర్ధారణ, నిధులతో చేసిన అభివృద్ధి పనులపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత పాలకుల అనాలోచిన నిర్ణయాల వల్ల పామిడిని నగర పంచాయతీగా ఏర్పాటు చేసి ప్రజలకు ఇబ్బందులకు గురి చేశారు. దీంతో నగర పంచాయతీ పన్నులు కట్టలేక ప్రజలు కష్టాలు పడ్డారన్నారు. ఈనేపథ్యంలో తాము అధికారంలోకి వస్తే పంచాయతీ చేస్తామని చెప్పిన హామీ మేరకు చేసి మాట నిలబెట్టుకున్నామన్నారు. పామిడి నగర పంచాయతీ నుంచి గ్రామపంచాయతీగా ఏర్పడినప్పటి నుంచి సుమారు రూ.6కోట్లతో రోడ్లు, డ్రెయినేజీ, కల్వర్టులు, వీధిదీపాలు, నీటి సరఫరా, పలు అభివృద్ధి పనులు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్, జానకిరామ్‌రెడ్డి, ఎంపిపి భోగాతి మురళీమోహన్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, పట్టణ వైసిపి కన్వీనర్ జోజోడె కుమార్, శ్రీనివాసరావు, వార్డు కన్వీనర్లు, పంచాయతీ, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.


గ్రామసభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి

నెలాఖరులోగా కృష్ణా, తుంగభద్ర జలాలు

ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

ప్రజాశక్తి-ఆత్మకూరు

నెలాఖరులోగా ఆత్మకూరు మండలానికి కృష్ణా, తుంగభద్ర జలాలు తెస్తామని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం మండలంలోని ముట్టాల, ఆత్మకూరు, పి.యాలేరు, పంపనూరు, తలుపూరు, మదిగుబ్బ, సనప గ్రామాల్లో కొత్త పింఛన్ల పంపిణీ చేశారు. అలాగే జలజీవన్ మిషన్ పథకంలో భాగంగా పంపనూరులో ఓవర్ హెడ్ ట్యాంకు నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఆయా కార్యక్రమాల్లో ముఖ్య అతిథిగా పాల్గొన్నా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆత్మకూరు, అనంతపురం రూరల్ మండలాల పరిధిలోని గ్రామాలు, కాలనీలకు తాగునీరు ఇచ్చేందుకు రూ.95 కోట్లతో పైపులైను పనులు ప్రారంభమైనట్లు తెలిపారు. నెలాఖరుకు పైపులైను పనులు పూర్తవుతాయన్నారు. తమ తాత తోపుదుర్తి రామచంద్రారెడ్డి బాగా చూసుకున్న ఆత్మకూరు మండలంలో గౌరవం నిలబెట్టేందుకు తాపాత్రయ పడుతున్నామన్నారు. ఇకపోతే అధికారంలో ఉన్నన్నాళ్లు ప్రజలను పట్టించుకోని మాజీమంత్రి పరిటాల సునీత ఎన్నికలు దగ్గర పడటంతో లేనిపోని విమర్శలు చేస్తున్నారన్నారు. ఇన్నేళ్లు అధికారంలో ఉన్న సునీత ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. పరిటాల కుటుంబం 20 ఎకరాల నుంచి నేడు 2వేల ఎకరాలకు ఎలా చేరిందో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్లు, ఎంపిపిలు, జడ్పీటీసీలు, వైస్ ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచులు, ఛైర్మన్లు, డైరెక్టర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

పెద్దాసుపత్రి వద్ద అన్నదానం

అనంతపురం : నిత్యసురభి ఛారిటబుల్ ట్రస్టు పుట్టినిల్లు ఆశ్రమం ఆధ్వర్యంలో శుక్రవారం నగరంలోని పెద్దాసుపత్రి వద్ద అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ట్రస్టు ఛైర్‌పర్సన్ ఎస్.నిర్మలా మురళి మాట్లాడుతూ ట్రస్టు సభ్యులు ఎం.సుబ్బిరెడ్డి వర్ధంతి సందర్భంగా ఆయన సతీమణి లీలావతి, కుమార్తెలు మౌనిక, రాధిక అన్నదానానికి సహకరించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు సుబ్రమణ్యం, ఓబుళపతి, జగన్నాథ్, లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు క్రికెట్ జట్టు

గుత్తి : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో శనివారం నుంచి నరసరావుపేటలో జరిగే రాష్ట్రస్థాయి అండర్-17 క్రికెట్ పోటీలకు అనంతపురం క్రికెట్ జట్టు బయలుదేరినట్లు ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి బి.సుగుణమ్మ తెలిపారు. గత నెలలో జరిగిన క్రికెట్ పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ చూపిన క్రీడాకారులను సెలక్టర్లు రాష్ట్ర పోటీలకు ఎంపిక చేసినట్లు ఆమె చెప్పారు. ఎస్‌జిఎఫ్ అండర్-17 క్రికెట్ జట్టు కెప్టెన్ గా గుత్తి పట్టణానికి చెందిన క్రీడాకారుడు ఎం.భువనేశ్వర్ సారథ్యంలో పోటీల్లో తలపడనున్నట్లు వివరించారు. క్రీడాకారులను ఆమెతో పాటు కోచ్ విజయకుమార్‌నాయక్ అభినందించారు.




వృద్ధులకు పరీక్షలు చేస్తున్న వైద్యులు

పేదలందరికీ మెరుగైన వైద్యం

ఎంపిపి కరణం పుష్పావతి భీమ్‌రెడ్డి

ప్రజాశక్తి-ఉరవకొండ

గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించడమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని చేపట్టిందని విడపనకల్లు ఎంపిపి కరణం పుష్పావతి భీమ్‌రెడ్డి, జడ్పిటిసి హనుమంతు తెలిపారు. శుక్రవారం మండల పరిధిలోని ఉండబండ గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల్లో అన్నివర్గాల ప్రజలకు ఇళ్ల వద్దకే వెళ్లి కార్పొరేట్ వైద్యం అందించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ శ్రీనివాసులు, వైద్యాధికారిణి అరుణకుమారి, ఇఒఆర్‌డి సత్యబాబు, సర్పంచి అన్నపూర్ణమ్మ, పంచాయతీ సెక్రటరీ అబ్దుల్, వైసిపి నాయకులు కరణం భీమిరెడ్డి, నాయకులు మాధవరెడ్డి, ఓబుళప్ప, సుంకన్న, సచివాలయ సిబ్బంది, వాలంటర్లు తదితరులు పాల్గొన్నారు.

సాలీడు పురుగు సంరక్షణపై అవగాహన

గుత్తి : మున్సిపాలిటీ పరిధిలోని గుత్తి ఆర్ఎస్‌లో శుక్రవారం సాలీడు పురుగు సంరక్షణపై రైల్వే అధికారులు, కార్మికులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. స్థానిక రైల్వే డీజిల్ లోకో షెడ్ నుంచి రైల్వే ఆసుపత్రి మీదుగా అంబేద్కర్ పార్కు వరకూ ర్యాలీ సాగింది. ఈకార్యక్రమంలో రైల్వే సీనియర్ డిఎంఇ రమేష్, ఏటీఎం సుంకన్న, సీనియర్ సెక్షన్ ఇంజనీర్ మనోజ్, ప్రభుదాసు, డాక్టర్ లక్ష్మీప్రసన్న, తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

కర్నాటక మద్యం పట్టివేత

గుత్తి : మండలంలోని బసినేపల్లి తండా సమీపంలో అక్రమంగా తరలిస్తున్న కర్ణాటక మద్యాన్ని గుత్తి పోలీసులు శుక్రవారం పట్టుకున్నారు. కర్నూలు జిల్లా తుగ్గలి మండలం రామలింగయ్య పల్లి గ్రామానికి చెందిన ఎరికల తిరుపాలమ్మ అనే మహిళ బెంగళూరు నుంచి తన గ్రామానికి అక్రమంగా తరలిస్తున్న కర్ణాటక మద్యం పోలీసుల దాడి చేసి పట్టుకున్నారు. ఆమె ను అరెస్ట్ చేశారు. నిందితురాలు వద్ద ఉన్న 374 టెట్రా ప్యాకెట్లు స్వాధీనం చేసుకుని సీజ్ చేసినట్లు ఎస్ఐ బి.నబిరసూల్, ఏఎస్ఐ మణిక్యం తెలిపారు. కేసు నమోదు చేసినట్లు తెలిపారు.


మద్యం వివరాలను వెల్లడిస్తున్న పోలీసులు

పుట్లూరు : మండల పరిధిలోని ఎ.కొండాపురం వద్ద మద్యాన్ని చేసుకోవడంతోపాటు నిందితుడు రామకృష్ణను అరెస్టు చేసినట్లు ఎస్ఐ దిలిప్‌కుమార్ తెలిపారు. రామకృష్ణ అక్రమంగా మద్యం తీసుకెళ్తున్నారన్న సమాచారంతో దాడి చేసి మద్యంతోపాటు నిందితుడిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు.

సచివాలయాలు ప్రారంభం

పెద్దపప్పూరు : మండల పరిధిలోని చీమలవాగుపల్లి, నరసాపురం, పసులూరు గ్రామాల్లో నిర్మించిన సచివాలయాలను ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాలన ప్రజలకు అందుబాటులో ఉండాలన్న సంకల్పంతో సిఎం జగన్ గ్రామాల్లోనే సచివాలయాలను ఏర్పాటు చేసి నిజాయితీగా సంక్షేమ పథకాలను అందజేస్తున్నారన్నారు. అంతేగాకుండా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తున్న ఘనత సిఎం జగన్‌కే దక్కుతుందన్నారు. అనంతరం ప్రజాశక్తి క్యాలెండర్‌ను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి రామిరెడ్డి, ఉపాధి హామీ పథకం సభ్యుడు వేమనాథరెడ్డి, వైసిపి మండల కన్వీనర్ అమర్నాథ్‌రెడ్డి, అశ్వర్థనారాయణస్వామి దేవస్థానం ఛైర్మన్ శ్రీనివాసులురెడ్డి, సర్పంచి హేమసుందర్‌రెడ్డి, చాగల్లు సూర్యనారాయణ, తురకపల్లి లక్ష్మీరెడ్డి, పసులూరు పురుషోత్తంయాదవ్, విలేకరి భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.


ప్రజాశక్తి క్యాలెండర్‌ను విడుదల చేస్తున్న ఎమ్మెల్యే పెద్దారెడ్డి

పెద్దపప్పూరులో 'భవిష్యత్తుకు గ్యారెంటీ'

పెద్దపప్పూరు : మండల కేంద్రంలో 'బాబు షూరిటీ - భవిష్యత్తుకు గ్యారెంటీ' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ ఇన్‌ఛార్జి జెసి అస్మిత్‌రెడ్డి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ వైఫల్యాలను వివరించారు. అంతేగాకుండా టిడిపి అధికారంలోకి వస్తే అమలు చేయనున్న ప్రభుత్వ పథకాలను వివరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు రామకృష్ణారెడ్డి, ప్రతాపరెడ్డి, యువ నాయకులు లోకనాథ్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, నాగేశ్వర్‌రెడ్డి, నాగరాజు, శ్రీనివాసులునాయుడు, చిక్కేపల్లి శివారెడ్డి, చాగల్లు శంకర, తురకపల్లి సంజీవరెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


మహిళతో మాట్లాడుతున్న అస్మిత్‌రెడ్డి

చౌకదుకాణాలపై దాడులు

అనంతపురం : అనంతపురం ప్రాంతీయ నిఘా, అమలు అధికారి ఎం.మునిరామయ్య ఆదేశాల మేరకు జిల్లాలోని కూడేరు మండల కేంద్రంలోని కమ్మవీధి, అరవకూరులో ఉన్న చౌకధాన్యపు దుకాణాలపై అధికారులు శుక్రవారం దాడులు నిర్వహించారు. ఇందులో భాగంగా రేషన్ దుకాణాల్లో రిజిస్టర్లు, నిల్వలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో అధికారులు జయపాల్‌రెడ్డి, ఫణీంద్రనాథ్‌రెడ్డి, టి.రాజశేఖర్, టి.కుళ్లాయిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నియంత్రణపై అవగాహన

అనంతపురం క్రైం : ఎస్పీ కెకెఎన్ అన్బురాజన్, ఆర్డీటీ మహిళా సాధికారత విభాగం డైరెక్టర్ విశాలాఫెర్రర్ సంయుక్త ఆధ్వర్యంలో కళాజాతా ద్వారా శుక్రవారం రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా రోడ్డు ప్రమాదాల జరగడం వల్ల కలిగే దుష్పరిణామాలను కళాజాతా ద్వారా వివరించారు. అలాగే చెడు వ్యసనాలు, సామాజిక అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమాల్లో డిసిఆర్‌బి సి.ఐ విశ్వనాథచౌదరి, ఆర్డీటీ బుక్కరాయసముద్రం ఆర్‌డి లక్ష్మణరావు, ఎటిఎల్ వనిత, తదితరులు పాల్గొన్నారు.

వందశాతం ఉత్తీర్ణత సాధించాలి : ఎంపిపి

ఉరవకొండ : టెన్త్, ఇంటర్ ఫలితాల్లో విద్యార్థులు వందశాతం ఫలితాలు సాధించాలని విడపనకల్లు ఎంపిపి కరణం పుష్పావతి భీమ్‌రెడ్డి, జడ్పిటిసి హనుమంతు సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని మాలాపురం గ్రామంలో ఉన్న కేజీబీవీ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యను బలోపేతం చేసేందుకు ఎన్నో సంస్కరణలు తీసుకొచ్చిందన్నారు. ఇందులో భాగంగా గ్రామీణ ప్రాంతాల్లో కూడా ఇంగ్లీష్ మీడియం తీసుకొచ్చిన ఘనత సిఎం జగన్‌కే దక్కిందన్నారు. అంతేగాకుండా నాడు-నేడు పనులు ద్వారా ప్రభుత్వ పాఠశాలల రూపరేఖలు మార్చారన్నారు. ఆయా అవకాశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు కరణం భీమిరెడ్డి, మాధవరెడ్డి, ఎస్సీ సెల్ జిల్లా నాయకులు సుంకన్న, తదితరులు పాల్గొన్నారు.

రేషన్ సరుకులు డోర్ డెలివరీ చేయాలి

బొమ్మనహాల్ : రేషన్ సరుకులు ఇంటి వద్దకే డోర్ డెలివరీ ఇవ్వాలని వైసిని నాయకులు ఫొటోస్టూడియో బసవరాజు, పయ్యావుల మారుతి, నీళ్ల నాగరాజు, తదితరులు డీలర్ శివమ్మ యువరాజును డిమాండ్ చేశారు. వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఇంటి వద్దకే బియ్యం పంపిణీ కార్యక్రమం చేపట్టిందన్నారు. అయితే బొమ్మనహాల్‌లో కొందరు డీలర్లు రేషన్‌షాపులోనే సరుకులు పంపిణీ చేయడంపై నిలదీశారు. వారిపై తహశీల్దార్ శ్రీనివాసులుకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. దీనిపై తహశీల్దార్‌ను వివరణ కోరగా 3 గ్రామాలకు 10 రేషన్ షాపులకు ఒకే వాహనం ఉన్నందున కొంత ఆలస్యం అవుతోందని, అత్యవసరం ఉన్న వారికి మాత్రమే చౌకదుకాణంలో సరుకులు పంపిణీ చేస్తున్నామని తెలిపారు.


స్టోర్ డీలర్‌ను నిలదీస్తున్న వైసిపి నాయకులు

పద్మశాలీయుల సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ

రాయదుర్గం : పట్టణంలోని భక్త మార్కండేయస్వామి ఆలయంలో శుక్రవారం ఆంగ్ల నూతన సంవత్సర పద్మశాలి క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. పద్మశాలి సంక్షేమ సేవా సంఘం అధ్యక్షులు ఆరవ శివప్ప అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎపి పద్మశాలి సంఘం ఉపాధ్యక్షురాలు జింక వసుంధర, మున్సిపల్ ఛైర్‌పర్సన్ పొరాలు శిల్ప హాజరై క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జాతీయ పద్మశాలి సంఘం కార్యదర్శి రాజు, రాయలసీమ సంయుక్త కార్యదర్శి ధనార్జన, కార్యదర్శి రామస్వామి, సంఘం నాయకులు నాగప్ప, పాండు, ధర్మకర్త ముకుంద, కౌన్సిలర్ గోవింద రాజులు, పురుషోత్తం, తదితరులు పాల్గొన్నారు.


క్యాలెండర్లను విడుదల చేస్తున్న పద్మశాలీలు